క్లుప్తంగా

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొల్లిపర: గ్రామాల్లో వివిధ ఫౌండేషన్, వైద్యశాలలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కొల్లిపర గ్రామంలోని పాలకేంద్రం కల్యాణ మండపంలో ఫీనిక్స్ ఫౌండేషన్ మరియు శంకర కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఆదివారం మండలంలోని 20 గ్రామ ప్రజలకు ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి మనోహర్ పాల్గొన్ని జ్యోతి ప్రజ్వల చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ వైద్య శిబిరానికి 20 గ్రామాల నుంచి 306 మంది వచ్చి పరీక్షలు చేయించుకున్నారన్నారు. తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఎంపీడీవో వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవితానికి నడక అవసరం



తెనాలిఅర్బన్: ఆరోగ్యకరమైన జీవితానికి నడక ఎంతో అవసరమని వైద్యురాలు డాక్టర్ శారద పేర్కొన్నారు. వాకర్స్ క్లబ్ తెనాలి-2 ఆధ్వర్యంలో శారద సర్వీస్ సొసైటీ సహకారంతో అమరావతి ఫ్లాట్స్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శారద మాట్లాడుతూ వృద్ధాప్యంలో అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వాటిని ఎదుర్కొనేందుకు నడక ఎంతో దోహద పడుతుందన్నారు. వాకర్స్ క్లబ్ తెనాలి-2 అధ్యక్షుడు వేజండ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ క్లబ్ సభ్యులకు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. సభ్యులు జి.మురహరిరావు, భుజంగరావు, సత్యనారాయణ రాజు, తుమ్మల సత్యనారాయణ, ఆర్.శివనాగేశ్వరరావు, అనురాధ, జ్యోతి, పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతులకు కాశీలో పిండ ప్రదానం



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మృతి చెందిన అనాథలకు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించడంతో పాటు ఆదివారం కాశీలో పిండ ప్రదానం చేశారు. వివరాలోకి వెళితే శ్రీ శివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో ఏడు సంవత్సరాల నుంచి అనాధ మృతులకు అంత్యక్రియలు నిర్వహిస్తూ వచ్చారు. మృతుల అస్థికలను హిందూ సంప్రదాయ పద్ధతిలో కాశీ పుణ్య క్షేత్రంలోని మణికర్ణిక ఘాట్ వద్ద ఆదివారం సమితి ఆధ్వర్యంలో పిండప్రదానం చేశారు. ఈ సందర్భంగా కుర్రా శ్రీను మాట్లాడుతూ హిందూ సంప్రదాయ ప్రకారం ఎవరైనా వ్యక్తి చనిపోతే అస్థికలను నిమజ్జనం చేసి పిండ ప్రదానం చేస్తే స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని తెలిపారు. మృతులకు ఎవరు లేనప్పటికీ తామే కుటుంబ సభ్యులవలే సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించడంతో పాటు గంగానదిలో అస్థికలను నిమజ్జనం చేసి పిండ ప్రదానం చేసినట్లు చెప్పారు. సేవా సమితి సభ్యులు ఎ.శివప్రసాద్, ఎస్.రాంబాబు, ఎం.తేజబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు వాహనాలు ప్రారంభం

తెనాలిఅర్బన్: 15వ ఆర్థిక సంఘం నిధులతో తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీ, మూడు కాంపాక్టర్లను సోమవారం రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. బుర్రిపాలెం రోడ్డులో యడ్లపాటి వెంకట్రావు ముఖద్వారం పునర్నిర్మాణం కార్యక్రమంలో కూడా వారు పాల్గొంటారని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చాలెంజింగ్ కాంపిటీషన్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. శివాజీచౌక్‌లో ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కోరారు.

జూదరుల అరెస్ట్

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డి కాలనీలో పోలీసులు ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడిచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ తాడేపల్లి అంజిరెడ్డి కాలనీలో ఓ నివాసంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో అక్కడకు వెళ్లి తనిఖీ చేశామని, ఈ తనిఖీలో 10 మంది పేకాట రాయుళ్లతో పాటు 33,800 రూపాయలు నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పురాణ పాత్రలకు ప్రాణం

- మూడున్నర వేలకు పైగా ప్రదర్శనలు
- అక్షరజ్ఞానం లేకున్నా యజ్ఞంలా సాధన
- రెండు నందులు, 130 పైగా పరిషత్ అవార్డులు అందుకున్న తిరుమలబీ
- ఈనెల 27న గుంటూరులో ఈలపాట రఘురామయ్య అవార్డు
- 29న తెనాలిలో స్వరలయ వేదిక ఉగాది పురస్కారం అందుకోనున్న సందర్భంగా ప్రత్యేక కథనం



'మోహినీ భస్మాసుర' నాటకంలో మోహిని పాత్రలో..



పొందిన అవార్డులతో షేక్ తిరుమలబీ

తెనాలి: పురాణ పాత్రలకు రంగస్థలంపై ప్రాణప్రతిష్ట చేస్తున్న నటీమణి షేక్ తిరుమలబీ. ఆంగికం, ఆహార్యం, అభినయంతో ఆయా పాత్రల పవిత్రతను, ఔన్నత్యాన్ని చాటుతున్నారు. సాధ్వీమణి సీత పాత్రలో కరుణ, శోకరసాన్ని పండించటమే కాదు.. అసూయతో రగిలిపోతూ సీతాపహరణానికి ప్రేరణగా నిలిచిన శూర్పణఖ పాత్రలోనూ ఇట్టే ఒదిగిపోతారు. వగలు, హొయలుతో భస్మాసురుడిని చిత్తుచేసే 'మోహిని'గా రంజింపజేస్తారు. ఏ ప్రాతలోనైనా పరకాయప్రవేశం చేసి ప్రేక్షకుల్ని లీనం చేయటమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డులతో సహా ఎన్నో పురస్కారాలను అందుకున్నారు. నాటకానికి గల విశిష్టతను గుర్తెరిగి, వృత్తిని అంతే బాధ్యతగా నిర్వర్తిస్తున్న బిజీ మహిళా ఆర్టిస్టుల్లో ఒకరైన తిరుమలబీ, కళావిపంచి, హైదరాబాద్‌వే 27న గుంటూరులో ఈలపాటి రఘురామయ్య అవార్డును, 29న తెనాలిలో స్వరలయవేదిక రజతోత్సవ ఉగాది సంబరాల్లో ఉగాది పురస్కారాన్ని అందుకోనున్నారు. సందర్భంగా తన నటప్రస్థానం విశేషాలు ఆమె మాటల్లోనే...

అనుకోకుండా నటినయ్యా..!

నేను ఆర్టిస్టునవుతానని ఎన్నడూ అనుకోలేదు. మాది సంగీత కుటుంబం. నా తండ్రి 'నాదకోకిల' వేల్పూరి నాసర్ మస్తాన్, పెదనాన్న వేల్పూరి పీర్ సాహెబ్ గొప్ప నాదస్వర విద్వాంసులు. మేం ఏడుగురు అక్కాచెల్లెళ్లం. ఆ వారసత్వంగా మాలో కొందరికి సంగీత పరిజ్ఞానం అబ్బింది. తాళం, శ్రుతి తెలియటంతో అప్పుడప్పుడు దేవాలయాల్లో పాటలు, భజనలకు వెళుతుండేదాన్ని. సంకీర్తనల్లో పాడుతుంటే గ్రాతం బాగుందని, 'నాటకాల్లోకి వెళ్లొచ్చు కదా!' అన్నారు. నవ్వేసి ఊరుకున్నాను. 'లక్ష్మీతిరుపతమ్మ కథ' నాటకంలో తిరుపతమ్మ పాత్రను పోషించే నటి ఏ కారణంచేతనో రాలేని పరిస్థితిలో ఆ పాత్రకు నన్ను వేయమని అడిగారు. 'గుళ్లో పాడుతుండే వేంకటేశ్వరస్వామి పాటలు పాడు...మిగతాది మేం చూసుకుంటాం' అన్న భరోసాతో ఒప్పుకోక తప్పిందికాదు. అప్పటికి నాకు 27 ఏళ్లు. పెళ్లయింది. బాబు, పాప ఉన్నారు. ఆవిధంగా తొలి నాటక ప్రదర్శనను పెనుగంచిప్రోలులో తిరుపతమ్మ అమ్మవారి దగ్గరే ప్రదర్శించాం. దేవస్థాన నిర్వాహకుల అభ్యర్థనపై రెండోరోజూ అదే నాటకాన్ని వేశం. ఇంకేముందీ...! నటన బాగుందని అందరూ మెచ్చుకున్నారు.

'రంగస్థల సీత'గా ప్రేక్షకుల మెప్పు..

అప్పట్నుంచి నటనే జీవితమైంది. మన సంస్కృతికి ఆధారమైన పురాణాల్లోని పాత్రల ఔచిత్యం చెడకుడా, నా మర్యాదకు భంగం వాటిల్లని రీతిలో నటించాలని నిర్ణయించుకున్నాను. ఇన్నేళ్లలో మూడు వేల పౌరాణిక నాటక ప్రదర్శనల్లో పాల్గొన్నాను. రామాయణంలో సీతారామ కళ్యాణం, పట్టాభిషేకం, సీతాపహరణం, వనవాసం సందర్భాల్లో ఆయా షేడ్లలో సీత పాత్రను పోషించటం ఒక సవాల్. విభిన్నమైన అభినయానికి ప్రాధాన్యత కలిగిన సీత పాత్ర పోషణతో 'రంగస్థల సీత'గా ప్రేక్షకుల మెప్పు పొందటం నా జీవితంలో గొప్ప మలుపు. ఇంకా అనేక పౌరాణిక పాత్రల్లో నటించాను. మోహినీ భస్మాసురలో 'మోహిని, లక్ష్మి, భూకైలాస్‌లో పార్వతి, మండోదరి, దక్షయజ్ఞంలో రోహిణి, సతీదేవి, పుత్రాదిచ్చేది, కచదేవయానిలో దేవయాని, యయాతిలో శర్మిష్ఠ, కాళహస్తి మహాత్మ్యంలో నీల, బాలనాగమ్మలో సంగు, బాలనాగమ్మ, హరిశ్చందలో చంద్రమతి, చింతామణిలో రాధ...ఇవే కాకుండా ద్రౌపది, శూర్పణఖ, కైక పాత్రల్లో నటించే అవకాశాలు వచ్చాయి. యక్షగానంలో చెంచులక్ష్మి, కనకతార, చారిత్రానికొస్తే, విశ్వనాథనాయకుడులో కళాణి, బుద్ధంశరణంలో గచ్చామిలో మాధవి, సామ్రాట్ అశోకలో నాగులాంబ పాత్రలను పోషించాను. సాంఘిక నాటకాల్లోనూ 500 ప్రదర్శనలిచ్చా.

డాక్టర్ వైఎస్సార్ చేతులమీదుగా నంది అవార్డు అందుకోవడం మధురానుభూతి..

అలుపెరగక సాగుతున్న నా నటజీవితంలో తీపి గురుతులు ఎన్నో...2003-04 నంది నాటకోత్సవాల్లో శూర్పణఖ పాత్రకు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి చేతులమీదుగా నంది అవార్డును తీసుకోవటం మధురానుభూతి. తర్వాతి సంవత్సరం నంద్యాలలో జరిగిన నంది నాటకోత్సవాల్లో ద్రౌపది పాత్రకు 'నంది'ని స్వీకరించాను. దేవయాని, ఉత్తర తదితర పాత్రలకు తిరుపతి పరిషత్‌లో 'గరుడ' అవార్డును తొమ్మిదిసార్లు అందుకున్నాను. వివిధ పరిషత్ పోటీల్లో ఉత్తమ నటిగా 130 సార్లు బహుమతులు వచ్చాయి. అక్షరజ్ఞానం లేకున్నా రకరకాల నాటకాల్లో పురాణ పాత్రల ఔచిత్యాన్ని అర్థంచేసుకుని పద్యాలను కంఠస్థం పట్టి రాగయుక్తంగా ఆలపించటం, తగిన అభినయంతో ప్రదర్శించగలగటం ఒక సవాలే. యజ్ఞంలా సాధన చేసినందునే విజయం సాధించగలిగాను. విద్యలేని కష్టం తెలిసిన నేను నా కొడుకు నాగూర్‌బాబును ఇంజినీరింగ్ చదివించాను. శాస్త్రీయ సంగీతాన్నీ నేర్పించా. కులాంతర వివాహం చేసుకుంటానంటే ఆశీర్వదించా. ఇంతటి శక్తినిచ్చిన ఆ కళామతల్లికి సర్వదా కృతజ్ఞురాలిని.'

సారూ.. ప్రచారం సూపరు!

పాఠశాలల్లో విద్యార్థుల చేరిక కోసం ప్రభుత్వ ఉపాధ్యాయుడి వినూత్న ప్రచారం



ద్విచక్ర వాహనంపై మైకులో ప్రచారం చేస్తున్న బట్టు వెంకయ్య

తెనాలి: ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే ప్రమాదముంది... వేసవిలో కౌన్సెలింగ్ తదుపరి కొన్ని పాఠశాలలు మూతపడే అవకాశమూ ఉంది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒకరు వినూత్న ప్రచారం ఆరంభించారు. మళ్లీ పాఠశాలలు పునఃప్రారంభం జరిగే వరకు దాదాపు తొంభైరోజులపాటు కొనసాగిస్తారు. 'అందరిదీ విద్య, అందరిదీ బాధ్యత' అనే నినాదంతో దీనిని చేపట్టారు.

మార్చి 15 నుంచి ప్రచారం..

పాఠాల బోధనకే పరిమితం కాకుండా తన వంతు సామాజిక బాధ్యతగా ఈ ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టిన ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య. నివాసం తెనాలి రూరల్ మండల గ్రామం సంగం జాగర్లమూడి. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలం వేటపాలెంలో గల జిల్లాపరిషత్ హైస్కూలులో ఉపాధ్యాయుడిగా చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చాలంటూ ఆయన తల్లిదండ్రులు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు విజ్ఞప్తిచేస్తున్నారు. ఇందుకోసం 13 నిముషాల ఆడియోను రూపొందించారు. తన ద్విచక్రవాహనానికి అమర్చుకున్నారు. హైస్కూళ్లు, కూడలి ప్రాంతాలు, గ్రామాల్లో పర్యటిస్తున్నారు. మార్చి 15వ తేదీన ఈ ప్రచారం ఆరంభించారు. ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు జరుగుతున్నందున సాయంత్రం పూట ప్రచారం చేస్తున్నారు. ఇతర రోజుల్లో మధ్యాహ్నం నుంచి పర్యటిస్తున్నారు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో సగభాగం కవర్ చేయాలనేది తన ఆకాంక్షగా బట్టు వెంకయ్య చెప్పారు.

26 అంశాలపై...

ప్రభుత్వం ఉచిత విద్య కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తోందని, అర్హులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని చాటుతున్నారు. అంతేకాకుండా ఉచిత యూనిఫాం, బ్యాగులు, షూలు, బెల్టులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్సులు సరఫరా, మధ్యాహ్న భోజనం, అందులో వడ్డించే పదార్థాలు, టీవీ, రేడియోలతో పాఠ్యాంశాల బోధన, పాఠశాలల్లో కల్పించిన సౌకర్యాల సహా మొత్తం 26 అంశాలను ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని నినదిస్తున్నారు. అందరూ చదవాలి...అందరూ ఎదగాలంటూ ముగిస్తున్నారు. ఆ క్రమంలో తెనాలి కొత్తపేటలో పర్యటిస్తున్నప్పుడు తీసిన ఫొటో ఇది...

భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

తెనాలిటౌన్: దేశం కోసం ప్రాణత్యాగానికి వెనుకాడని మహనీయుడు భగత్‌సింగ్ అని ఏపీఆర్‌పీఏ తెనాలి డివిజన్ నాయకులు జి.ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్, ఏపీఆర్‌పీఏ తెనాలి డివిజన్ నాయకుడు జి.ప్రసాద్ పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత భగత్‌సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్మిక, కర్షక ఉద్యోగుల హక్కుల కోసం భగత్‌సింగ్ మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఐక్యవేదిక నాయకులు తోటకూర శ్రీనివాసరావు, బి.బ్రహ్మానందరెడ్డి, వి.శ్రీనివాసరావు, ప్రజా చైతన్య ఐక్యవేదిక నాయకులు ఆర్.శివకృష్ణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, అంగన్‌వాడీ తెనాలి ప్రాజెక్టు నాయకురాలు ఏఎల్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

విద్యాదాత బెంజిమెన్ సేవలు చిరస్మరణీయం



బెంజిమెన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

తెనాలిటౌన్: ఎందరో పేద విద్యార్థులకు విద్యనందించి వారి ఉన్నతికి పాటుపడిన పొన్నెకంటి బెంజిమెన్ సేవలు చిరస్మరణీయమని ఆది జాంబవా దళిత ఎంప్లాయీస్ సేవా సమితి సభ్యులు కొనియాడారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఆదివారం బెంజిమెన్ వర్ధంతిని దళిత ఎంప్లాయీస్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు సేవా సమితి కార్యదర్శి ఉన్నం యెహెజ్కేల్ అధ్యక్షత వహించారు. విశ్రాంత పోస్టల్ ఉద్యోగి సుద్దపల్లి శరత్ వెంకయ్య మాట్లాడుతూ బెంజిమెన్ ప్రోత్సాహంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు విద్యాసంస్థల్లో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించినట్లు గుర్తు చేశారు. యెహెజ్కేల్ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో గ్రామంలో బెంజిమెన్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐవోసీ డీలర్ యడ్లపల్లి రవికిరణ్, సమితి సభ్యులు కె.పాపారావు, ఎస్.వినయ్‌కిరణ్, ఎం.గురుదేవ్, డాక్టర్ కె.మోహనరావు, ఎం.ప్రభాకరరావు, టి.అనిల్ కుమార్, టి.సాంబయ్య, పి.సాంబశివరావు, కె.జార్జి థామస్, ఎస్.మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి కలిసుండాలని కోరుకోండి

హైలెవెల్ వంతెన శంకుస్థాపనలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్, పక్కన పెమ్మసాని, ఆలపాటి

కొల్లిపర(తెనాలి): కూటమి కలిసుండాలని ప్రజలు కోరుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కూటమిలో అందరూ సమర్థవంతమైన నాయకులు ఉన్నారనీ, అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. కొల్లిపరలో రేపల్లె బ్యాంక్ కెనాల్‌పై రూ.4.19 కోట్ల అంచనాతో హైలెవెల్ వంతెన నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు జాబ్‌కార్డులు తక్కువగా ఉండటంతో కేవలం రూ.2 కోట్లే మంజూరైనట్లు చెబుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను మంత్రి మనోహర్‌ను కలిసి చేసిన విజ్ఞప్తితో రూ.10 కోట్లు విడుదలైనట్లు చెప్పారు. కేంద్రం నుంచి రూ.20 కోట్ల అంచనాలతో మూడు రోడ్ల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చినట్టు చెప్పారు. మొత్తంమీద తెనాలికి రూ.37 కోట్లు తీసుకురావటం జరిగిందన్నారు. రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కొత్తగా నిర్మిస్తున్న వంతెన రైతాంగానికి, ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. డొంకరోడ్ల నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి రూ.10 కోట్లు విడుదల చేశారని చెబుతూ వీటితో వేసవిలో మండలంలోని డొంకరోడ్లన్నీ పూర్తిచేస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు హైలెవెల్ వంతెన అనుసంధానం కాగలదని చెప్పారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లోపే కొత్త కౌలు చట్టం తేవాలి

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఏపీ కౌలు రైతుల సంఘం వినతి

తెనాలి: రానున్న ఖరీఫ్ సీజన్ లోపే రాష్ట్రంలో కొత్త కౌలు చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రతినిధి బృందం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, కౌలు చట్టంపై మంత్రివర్గ ఉప సంఘం సభ్యుడు నాదెండ్ల మనోహర్‌ను తెనాలిలో కలిసి విజ్ఞప్తిచేసింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, కొత్త చట్టం రాకపోవటం, ఈ-క్రాప్ చేయటంలోను, పంట రుణాలు, మిగిలిన ప్రభుత్వ పథకాలు పొందటంలోనూ కౌలు రైతులు గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్లలో తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎన్నో మార్పులు తీసుకొస్తాననే ప్రభుత్వం, వాస్తవ సాగుదారులుగా ఉండి వ్యవసాయాన్ని నష్టాల్లో కూడా సాగు చేసి దేశంలో ప్రజలందరికీ ఆహార ధాన్యాలు అందించే కౌలు రైతులపై సానుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ముందు తెలుగుదేశం కూటమి కౌలు రైతులకు మేలు జరిగేటట్లు కొత్త కౌలు చట్టం తీసుకొస్తామని ప్రకటించారుని గుర్తుచేశారు. కొత్త కౌలు చట్టాన్ని తీసుకొస్తున్నామని బడ్జెట్ సమావేశంలోనూ చెప్పినట్టు తెలిపారు. త్వరలో మళ్లీ ఖరీఫ్ ప్రారంభం కానున్నందున, ఈలోగా ఆర్డినెన్స్ రూపంలోనైనా నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ప్రతినిధి బందంలో ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎం.నాగమల్లేశ్వరరావు, జిల్లా నాయకుడు ములకా శివసాంబిరెడ్డి వున్నారు.

రాష్ట్రంలోని సినీ సంఘాలను పట్టించుకోకపోవడం దురదృష్టకరం



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: ఆంధ్రాలో సినీపరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న నూతన పాలసీపై రాష్ట్రంలోని సినిమా సంఘాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవటం దురదృష్టకరమని 'మా- ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా వ్యాఖ్యానించారు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 క్రాఫ్ట్ యూనియన్ (మా-ఏపీ) కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన పాలసీపై ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, మా-ఏపీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రలో స్టూడియోలను నిర్మించాలని, నటీనటులు, నిర్మాతలు, దర్శకులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలనీ, మౌలిక సదుపాయలను కల్పించాలని గత ఆరేళ్లుగా మా- ఏపీ కొన్నేళ్లుగా మొరపెట్టుకుంటూ వస్తున్నట్టు గుర్తుచేశారు. తెలంగాణలో నివసిస్తున్న సినిమా పెద్దలకు ఆహ్వానంపై తమకు అభ్యంతరం లేదనీ, ఆంధ్రలోని సినిమా సంఘాలను కూడా పిలవాలని కోరుతున్నట్టు స్పష్టంచేశారు. బ్లాక్ బస్టర్ సినిమాల నిర్మాత ఏఎం రత్నం ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడిగా ఉన్నారని, నూతన పాలసీపై ఆయన సలహాల అవసరం ఉందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత మా-ఏపీ రిజిస్ట్రేషన్ జరిగిందని, నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'మా-ఏపీ' లోగోను ఆవిష్కరించారని గుర్తుచేస్తూ, తమకు గుర్తింపు లేదని కొందరు దుష్ప్రచారం చేయటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తన 'పండుగాడి ఫొటో స్టూడియో' ఆంధ్రలోనే తీశానని చెప్పారు. 90 డైరెక్ట్ సినిమాలు, 200 పైగా డబ్బింగ్ సినిమాలు ఏపీ ఫిలిం ఛాంబర్ నుంచి సెన్సార్ అయినట్టు వివరించారు. వీరితో నూతన దర్శకులు మణివరన్, నరేష్ దోనే ఉన్నారు.

ప్రజా చైతన్య యాత్రలో సమస్యల వెల్లువ

మంగళగిరి: ప్రజా చైతన్య యాత్రలో ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తుతున్నాయని సీపీఎం నాయకులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని కొప్పురావుకాలనీ, ఆంజనేయకాలనీలలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆంజనేయ కాలనీలోని మహిళ కరెంట్ బిల్లు చూపించి తాము గత నెల అంతా ఇంట్లో లేమని ఊరికి వెల్లామని అయినా కరెంట్ ఎప్పటిలాగే వచ్చిందని తెలిపింది. బిల్లులో వాడకం రూ.24 కాగా ట్రూ అప్ ఛార్జీలు ఇతర ఛార్జీలతో కలిపి రూ.199గా బిల్లు వచ్చింది. 70 సంవత్సారాల వృద్ధుడు తనకు వేలి ముద్రలు పడడం లేదని పెన్షన్ రావడం లేదని తెలిపారన్నారు. ప్రజలను దోచుకుంటున్న ప్రభుత్వంపై పోరాడాల్సిన అవసరం వుందన్నారు. ప్రజా వ్యతిరేక పోరాటాలకు ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

మాజీ రౌడీషీటర్.. చేసేది సెటిల్‌మెంట్స్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల రౌడీ షీట్ తీయించుకున్న ఓ వ్యక్తి కిందిస్థాయి పోలీసులను తన బుట్టలో వేసుకుని చక్రం తిప్పుతూ తనదైన శైలిలో సెటిల్‌మెంట్ చేస్తూ అందినకాడికి జేబులు నింపుకుంటూ పబ్బం గడుపుతున్నాడు. నవంబర్‌లో నవులూరుకు చెందిన ఏ1 రౌడీషీటర్ తన రౌడీషీట్‌ను కోర్టు ద్వారా తీయించుకున్నాడు. అనంతరం యస్ఐ స్థాయి కింద సిబ్బందితో మందు, ఇతర పార్టీలు ముందుగా అందజేసి తరువాత ఆ మాజీ రౌడీషీటర్ వారిని చెప్పుచేతల్లో పెట్టుకుని మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సెటిల్‌మెంట్లకు తెరలేపాడు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఎస్ఐలు, ఇతర ఉన్నతాధికారులు మాజీ రౌడీషీటర్ నీకు ఇక్కడ ఏం పని అని అడుగుతారనే భయంతో సదరు కానిస్టేబుల్‌ను ఎకో పార్కుకు పిలిపించి అక్కడే సెటిల్ చేసి ఎవరికి ఇవ్వాల్సిన డబ్బులు వారి అందజేసి సెటిల్‌మెంట్లు చేస్తున్నాడు. ఈ మధ్యకాలంలో మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఓ కుటుంబ ఆస్తి విషయంలో తలదూర్చి అవతలి వారిని బెదిరించడంతో రూరల్ ఎస్ఐ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. అప్పటి నుండి పోలీస్‌స్టేషన్ బయట ఉండి సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు సమాచారం. పోలీస్ ఉన్నతాధికారులు సదరు మాజీ రౌడీషీటర్‌పై దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

'శిశిరం' బాలల చిత్రం రెండో షెడ్యూల్ ప్రారంభం



తెనాలి: విద్య నేపథ్యంలో తెరకెక్కనున్న 'శిశిరం' చిత్రం రెండవ షెడ్యూల్ షూటింగ్ తెనాలి చినరావూరులో ఆదివారం ప్రారంభమైంది. శ్రీకృష్ణ ఆర్ట్స్ పతాకంపై కనపర్తి రత్నాకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, స్థానిక కళాకారులు పాల్గొన్నారు. అక్కడ సన్నివేశం చిత్రీకరణ తదుపరి పట్టణ, పరిసరాల్లోని వివిధ ప్రదేశాల్లో, సాయంత్రం చేబ్రోలు మండల గ్రామం శేకూరులో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. మూడు రోజుల పాటు షూటింగ్ కొనసాగుతుందని తెలిపారు. తహశీల్దార్ గోపాలకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రధానాంశాలుగా తెరకెక్కుతున్న చిత్రంలో ఎమ్మార్వో పాత్రలో నటించే అవకాశం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రానికి కో-ప్రొడ్యూసర్లుగా వెంకటప్రసాద్ అమిరినేని, సాధు చలపతి, కన్నెగంటి రవి, అనిల్ మూకిరి వ్యవహరిస్తున్నారు.

వయోజనులకు రాతపరీక్ష



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో వయోజనులకు ఆదివారం రాతపరీక్ష నిర్వహించినట్లు ఏపీవో నాగేశ్వరరావు తెలిపారు. గతేడాది నవంబర్ నుంచి ఇప్పటివరకు 530 మందికి డీఆర్‌డీఏ, వెలుగు గుంటూరు ఆదేశాలతో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామసమాఖ్య సహాయకులు, డ్వాక్రా సభ్యులతో చదువు చెప్పడం, లెక్కలు చేయడం వంటివాటితో వారిని అభ్యాసకులుగా తయారు చేసినట్లు చెప్పారు. అక్షరాస్యతను అంచనా వేసేందుకు వారికి ఆయాగ్రామాల్లోని ప్రభుత్వపాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో విడతల వారీగా పరీక్షలు నిర్వహించామన్నారు. పర్యవేక్షకుడిగా అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ చలపతిరావు, మండల పర్యవేక్షకులు ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఏపీవో నాగేశ్వరరావు, క్లస్టర్ పర్యవేక్షకులుగా వెలుగు సీసీలు షేక్. కరిముల్లా, సీహెచ్ ఆదిలక్ష్మి, జి. రమాదేవి, డి.ద్వారక, ఇన్విజిలేటర్లుగా అంగన్‌వాడీలు వ్యవహరించినట్లు తెలిపారు.

30న జై భీమ్ చాంపియన్స్ ట్రోఫీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా ఈ నెల 30 నుంచి జై భీమ్ చాంపియన్స్ ట్రోఫీ నిర్వహించనున్నట్లు జైభీమ్ యూత్ (గొల్లపాలెం) ఆర్గనైజర్ స్వర్ణ రైస్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ. 50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలు, చతుర్ధ బహుమతిగా రూ.పదివేల నగదు అందజేస్తామన్నారు. పోటీలో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, డ్రస్ కోడ్ పాటించాలని చెప్పారు. వివరాలకు 7799 820420 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

గృహ నిర్మాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిరూరల్ : నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గృహాలు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సొంత స్థలం కలిగి ఉండి, గృహం నిర్మాణం చేసుకొనుటకు సిద్ధంగా ఉన్న అర్హత కలిగిన కుటుంబాల వారు 4బీ అప్లికేషన్ ఫాంను గ్రామ, వార్డు సచివాలయాల కార్యాలయాల్లో ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్జీదారులు, వారి భర్తతో కలసి ఉన్న ఫొటోను విధిగా అర్జీకి అతికించాలని, ఆదాయ ధ్రువీకరణ పత్రం రేషన్ కార్డు, కరెంట్ బిల్లు, హౌస్ ట్యాక్స్ బిల్లు, ఓటరు ఐడి కార్డు, కుటుంబ సభ్యులు అందరి ఆధార్ కార్డుల నకళ్లు, కుల ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత బ్యాంకు ఖాతా మొదటి పేజీ, ఇంటి పట్టా లేదా సొంత ఇంటి స్థలం డాక్యుమెంట్లు, అంగ వైకల్యము ఉంటే సంబంధిత సర్టిఫికెట్ మొదలైన జెరాక్స్ కాపీలను అప్లికేషన్‌కు జతచేయాలని, ఆధార్‌కార్డు అనుసంధానమైన ఫోన్ నంబరు కలిగి ఉండాలని అర్హులైన వారు ఈ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.